జడివాన జోరు.. జ్వరాల హోరు

- ఇంటింటా జ్వరపీడితులు
- వర్షాలతో క్షీణిస్తున్న పారిశుధ్యం
- రోగులతో నిండిపోతున్న ఆస్పత్రులు

అలమూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గత మూడు రోజుల నుంచి జోరుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. ఇంట్లోంచి బయటకు వచ్చి దైనందిన కార్యక్రమాలను చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది, అదే సమయంలో వర్షాల ప్రభావంతో చెత్త చెదారం, వ్యర్థాలు రహదారులు, కూడళ్లలో పడవేయడంతో పారిశుధ్యం లోపిస్తుంది. దీంతో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో 24 పీహెచ్‌సీలు, నాలుగు సామాజిక ఆస్పత్రుల్లో అనునిత్యం వందలాది మంది రోగులు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు. ఇంట్లో ఒకరి తరువాత ఒకరికి ఇంటిల్లపాదికి విష జ్వరాలు సోకి అల్లాడి పోతున్నారు. ప్రతి ఒక్కరిలో ప్రధానంగా ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, రొంప లక్షణాలు అధికంగా ఉండటంతో రోజుల తరబడి నీరసం వేధిస్తుంది. గత ఏడాది కంటే ఈ ఏడాది జ్వరాల తీవ్రత అధికంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల దృష్ట్యా పల్లెలు, పట్టణాలు అనే తారతమ్యం లేకుండా పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారు కావడం ప్రజలకు శాపంగా పరిణమించింది.

పారిశుధ్యంపై దృష్టి కేంద్రీకరించాలి

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటిస్తూ పారిశుధ్య కల్పనపై ప్రజలను చైతన్యవంతం చేస్తున్నా ఫలితం కన్పించడం లేదు, ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ప్రజా సంక్షేమంతో పాటు పారిశుధ్య కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేయాలనే ప్రజలు కోరుతున్నారు. జనాభాకు అనుగుణంగా ఆయా గ్రామ పంచాయతీలు పారిశుధ్య కార్మికులను నియమించుకోవడం ద్వారా అధ్వాన పారిశుధ్యం నుంచి బయట పడవచ్చని అభిప్రాయం వ్యక్తమవుతుంది. అలాగే గ్రామ పంచాయతీ పాలక వర్గాలు పారిశుధ్యం విషయంలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞాపనలు చేస్తున్నారు.

రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆస్పత్రులు

క్లస్టర్ పరిధిలోని మూడు నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. 11 మండలాల్లోనున్న పీహెచ్‌సీల్లో ప్రతి రోజు సగటున 200 మంది వైద్యుల వద్దకు వస్తుండగా ఆలమూరు, కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం సీహెచ్‌సీల్లో దాదాపు 500 మంది రోగులు చికిత్సకు వస్తుంటారు. అందులో అధిక భాగం మంది టైఫాయిడ్, మలేరియా, చికున్ గున్యా వంటి సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు. జ్వరాలకు ఒక వైద్యం పొందుతుండగానే రక్తకణాల సంఖ్య తగ్గిపోయి ఒక్కోసారి రోగి ప్రాణపాయ స్థితికి చేరుకున్న పరిస్థితులున్నాయి.



ఆలమూరు సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మహిళా వైద్యాధికారి



కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో పక్కనే నిల్వ చేసిన కొబ్బరి వ్యర్థాలు

ఆస్పత్రుల్లో వేధిస్తున్న మందుల కొరత?

క్లస్టర్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వివిధ జ్వరాలు, వ్యాధుల నియంత్రణకు ఉపయోగించే ఔషధాల కొరత తీవ్రంగా వేధిస్తుంది. జ్వరం సోకిన వ్యక్తికి రోజుల వ్యవధిలో చికిత్స అందించడంతో కొంతమేర ఆరోగ్య రక్షణకు తోడ్పాటు అందిస్తుంది. దీని వల్ల రోగులు ప్రైవేట్ వైద్యుల వద్దకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. జ్వరం వస్తే చాలు రూ.వేలల్లో ఖర్చవుతుందని వారు వాపోతున్నారు, కొన్ని చోట్ల అయితే టైఫాయిడ్ పూర్తి చికిత్సకు రూ.ఐదు వేల నుంచి పది వేల వరకూ బిల్లు వేస్తున్నారు.

సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నాం



వాతావరణ పరిస్థితులు, ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నాం. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని కోలుకున్నాం. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది.

– కె.జగపతిరామయ్య, పెదపళ్ల

పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నాం



అధిక వర్షాల వల్ల వాతావరణం మార్పులు సంభవించి ప్రజలకు అనారోగ్యానికి కారణమవుతుంది. గ్రామ పంచాయతీల సహకారంతో క్షేత్రస్థాయిలో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం.

– ఏవీవీ రాజా అక్కుల, పీహెచ్‌సీ పెదపళ్ల

క్లుప్తంగా

వైనతేయ తీరంలో గరుత్మంతుడి విగ్రహం



అప్పనపల్లిలో దాత కుటుంబ సభ్యులు ఆవిష్కరించిన గరుత్మంతుడి విగ్రహం

మామిడికుదురు: ప్రముఖ పుణ్యక్షేత్రం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి స్నానఘట్టం వద్ద దాతల విరాళం రూ.రెండు లక్షలతో నిర్మించిన గరుత్మంతుడి విగ్రహాన్ని శనివారం ప్రారంభించారు. ఐ.పోలవరం మండలం మురముళ్లకు చెందిన దాత చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యుల విరాళం రూ.2 లక్షలతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దాత కుటుంబ సభ్యులతో విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ సేవలు ఎనలేనివి



రాధాకృష్ణ దంపతులను సత్కరిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో సుదీర్ఘ కాలం పనిచేసి పేద ప్రజలకు సేవలందిస్తూ పదవీ విరమణ చేయబోతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) పి.రాధాకృష్ణ సేవలు ఎనలేనివని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయి కిషోర్ అన్నారు. మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీలో ఉద్యోగ విరమణ చేయబోతున్న సీహెచ్‌ఓ రాధాకృష్ణకు శనివారం సత్కార సభ జరిగింది. జిల్లాలోని అనేక పీహెచ్‌సీల్లో వివిధ హోదాల్లో 43 ఏళ్ల పాటు పనిచేసిన రాధాకృష్ణ సేవలను పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం రాధాకృష్ణ, సాయిలక్ష్మి దంపతులకు స్థానిక పీహెచ్‌సీ అధికారులు, ఆరోగ్య ఆశ సిబ్బంది పూలమాలలు వేసి దుశ్శాలువా వేసి మెమెంటోతో సత్కరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు పి.ఉమ, ఎం.శ్రీనివాసరావు, ఫార్మసిస్టు డి.సుగుణలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు వి.సుబ్బారావు, ఆర్ నాగేశ్వరరావు, ఎల్‌టీ ఆర్ రాజారమేష్‌కుమార్ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, ఎంపీ



సఖినేటిపల్లిలంకలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంకలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన వినాయక ఆలయంలో ప్రతిష్ఠలో ఎమ్మెల్యే, ఎంపీ పాల్గొన్నారు. స్వామి వారికి వారు ప్రత్యేక పూజలు చేశారు. రేపూరి ఏసు నరసింహ రాజా, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

అయినవిల్లి: రాష్ట్ర సర్పంచుల సమాఖ్య కార్యదర్శి, వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం వీరవల్లిపాలెంలో పంపిణీ చేశారు. ఒక్కరోజు ముందుగానే కూటమి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉదయం 5.30 నిమిషాల నుంచి కార్యాలయ సిబ్బంది, గ్రామంలోని ప్రజాప్రతినిధులు, ఉమ్మడి పార్టీల నాయకుల సమక్షంలో పంపిణీ చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ పింఛన్లు పంపిణీ చేశారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేపీ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆటలు, మానసిక వికాసంతో పాటు చదువుల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు వివిధ ఆటలు పోటీలు ఈనెల 27 నుంచి కళాశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, పీడీ కనకరాజు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



నేదునూరులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కె.మనోహర్ జోషి

అయినవిల్లి: చవితి మండపాల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్థానిక ఎస్సై కె.మనోహర్‌జోషి తెలిపారు. నేదునూరు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఎస్సై కె.మనోహర్‌జోషి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. చవితి మండపాల వద్ద ఏర్పాటు చేసే డీజేలు, సౌండ్ సిస్టమ్ వంటివి నిషిద్ధమన్నారు. చవితి మండపాల వద్ద ఏ విధమైన సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లిన ముందస్తుగా తెలియపర్చాలని ఇటువంటి గస్తీలు తిరగడం వల్ల దొంగతనాలను పూర్తిగా నివారించవచ్చన్నారు. యువత మోటార్‌సైకిళ్లపై అతివేగంతో ప్రయాణిస్తున్నారన్నారు. వారిపై చర్యలుంటాయన్నారు. ముందుగా గామ పెద్దలు హెచ్చరించాల్సి ఉందన్నారు. అప్పటికీ వినకపోతే వారి పేర్లు ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లోను, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీలు కళ్లేపల్లి సుబ్బరాజు, ఇందుగుల వెంకట్రామయ్య, నాయకులు పినిపే ఉమామహేశ్వరరావు, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: ప్రజారోగ్యం విషయంలో వెనకాడేది లేదని వైరల్ వ్యాధులపై అధికారులు, ఉద్యోగుల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ప్రబలుతున్న వ్యాధులపై తగిన చర్యలు తీసుకునేందుకు ఆరోగ్య, పంచాయతీ, తాగునీటి సరఫరా, డ్రైనేజీ తదితర అధికారులతో సత్యానందరావు శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్య శాఖ ఫీవర్ సర్వే నిర్వహించాలని అలాగే పంచాయతీ అధికారులు శానిటేషన్ పనులు చేయాలని ఆదేశించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు వైద్యం, సురక్షిత తాగునీరు, పరిశుభ్రత అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గ్రామ స్థాయి వైద్య ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని అవసరమైన వారు వీటిని వినియోగించుకోవాలని సత్యానందరావు కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుమలత పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలకు పి.గన్నవరం మండలం ఊడుమూడికి చెందిన ప్రవాస భారతీయుడు గిడ్డి శ్యామ్ రూ.25 వేల విలువైన ఇన్వర్టర్‌ను బహూకరించారు. ప్రిన్సిపాల్ వైటీఎస్ రాజు సమక్షంలో శనివారం పాఠశాలకు అందజేశారు. దాత శ్యామ్‌కు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏటీఎస్ ప్రతాప్, ఉపాధ్యాయులు బళ్ల రవికుమార్, వెంకటేశ్వరరావు, విజయ్ పాల్గొన్నారు.



సమనస గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ అందిస్తున్న దాత శ్యామ్

భీమేశ్వరాలయ ఈఓగా అల్లు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ఈఓగా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని శనివారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వుల మేరకు పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే అదనపు బాధ్యతగా ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో విధుల్లో చేరారు. ఆలయ సిబ్బంది ఆమెకు గౌరవపూర్వకంగా స్వాగతం పలికారు.



అల్లు వెంకట దుర్గాభవాని

పందుల నుంచి పంటలను కాపాడండి

అంబాజీపేట: పందులు విచ్చలవిడిగా స్వైరవిహారం చేసి పంటలను ధ్వంసం చేసి అపార నష్టం కలిగిస్తున్నాయని వాటి నుంచి తక్షణమే పంటలను కాపాడాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాచవరంలో కొలిశెట్టి భానుప్రసాద్‌కు చెందిన నాలుగు ఎకరాల్లో అరటి పంటను పందులు పూర్తిగా ధ్వంసం చేవాయి. ఈ పందుల వల్ల రూ.లక్షల్లో పంట నష్టం వాటిల్లిందని రైతు భానుప్రసాద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా పందుల వల్ల అరటి పంట, ఇతర పంటలు నష్టపోతున్నామని వాటిని తక్షణమే అరికట్టాలని పంచాయతీ అధికారులకు, పాలక వర్గ సభ్యులకు మొరపెట్టుకున్న తాత్కాలిక ఉపశమనమే తప్ప పూర్తి స్థాయిలో రైతుకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నారని శ్రీ ధరణి రైతు సమాఖ్య రైతులు విమర్శిస్తున్నారు. పంచాయతీ ఉన్నతాధికారులు రావడం రైతుల సమస్య వినడం వెళ్లడమే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోయారు. పందుల వల్ల చేతికి అందివచ్చిన పంటను ధ్వంసం చేయడంతో రూ.లక్షలు నష్టపోయి అప్పుల బారిన పడుతున్నామని వాపోయారు. విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులను అరికట్టకపోతే రాబోయే రోజుల్లో పంటలు వేయడం కష్టతరమని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు తెలిపారు.

వినాయక విగ్రహ ప్రతిష్ఠలో గొల్లపల్లి

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంకలో శనివారం నూతనంగా నిర్మించిన వినాయక స్వామి ఆలయంలో స్వామివారి ప్రతిష్ఠ కార్యక్రమంలో రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు. ఆలయంలో స్వామికి ఆయన పూజలు నిర్వహించారు. నాయకులు చల్లా నాగరాజు, కొల్లాబత్తుల కుమార్, యల్లమిల్లి కిషోర్, తాడి సహదేవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రమణ మృతి



కడలి వెంకట రమణ (ఫైల్)

ఆలమూరు: మండలంలోని నర్సిపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కడలి వెంకటరమణ (45) ఆకస్మికంగా మృతి చెందారు. శుక్రవారం రాత్రి వెంకటరమణకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు, అక్కడ ఆరోగ్యం మరింత విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు వెంకటరమణకు భార్య వీరలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, సీఈఓ గంగరాజు కొండలరావు తదితరులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

నల్లా వర్ధంతి



పి.గన్నవరంలో నల్లా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ నల్లా సూర్యచంద్రరావు వర్ధంతిని శనివారం స్థానిక అక్విడెక్ట్ పార్కులో నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్లా అందించిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, సూర్యచంద్రరావు తనయులు నల్లా అజయ్, సంజయ్, నాయకులు ఆదిమూలం సూరయ్యకాపు, నల్లా పెదకాపు, కర్రి బాబూరావు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుండపోత..



వర్షానికి నిర్మానుష్యంగా మారిన అంబాజీపేట ప్రధాన రహదారి



పి.గన్నవరంలో పాడైపోయిన ఏజీ రోడ్డు

- స్తంభించిన జనజీవనం
- రెండు రోజులుగా తెరిపినివ్వని వర్షాలు
- కొనసాగుతున్న వర్షంతో పాఠశాలలకు సెలవు

కొత్తపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కోనసీమ తడిసి ముద్దయింది. ఎక్కడికక్కడ జన జీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం ఉదయం నుంచి ఒక మోస్తరుగా మొదలైన వర్షం ఆ రోజు రాత్రి నుంచి కుండపోతగా కురుస్తూనే ఉంది. శనివారం కూడా వర్షం కొనసాగింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం చాలా వరకు ఇంటికే పరిమితమైంది. కాలు బయటపెట్టే వీలు లేకుండా వాన కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. ముఖ్యంగా పొలం పనులకు వెళ్లే రైతులు, పాడి పశువుల రైతులు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు వర్షంతో ఇబ్బంది పడ్డారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్ కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రెయిన్లు వర్షపునీటితో పొంగి ప్రవహించాయి. వర్షం, గాలుల కారణంగా పలు ప్రాంతాల్లో చెట్లు, షెడ్లు కూలిపోయాయి. డ్రెయినేజీలు పొంగి ప్రవహిస్తుండటంతో పలు రోడ్లు చెరువులను తలపించాయి. కంటిన్యూగా కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో ఒకటి, రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీనితో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం శనివారం సెలవు ప్రకటించింది. ఆ మేరకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం నిర్వహించవలసిన పరీక్షలను సెప్టెంబర్ 6న నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మలికిపురంలో

మలికిపురం: భారీ వర్షాలతో రాజోలు దీవిలో శనివారం జనజీవనం స్తంభించింది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం వరకూ ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. పాఠశాలలను ముందే మూయించి వేశారు. వాహనాల రాకపోకలు కూడా స్తంభించాయి. వాయుగుండం వల్ల సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. అంతర్వేది కర నుంచి కరవాక వరకూ సముద్రం అల్లకల్లోలంగా మారింది. రెవెన్యూ యంత్రాంగం వీఆర్‌వోలను అప్రమత్తం చేసింది.

అంబాజీపేట మండలంలో..

అంబాజీపేట: అల్పపీడన ప్రభావంతో శుక్రవారం తెల్లవారుజాము నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో అంబాజీపేట మండలం తడిసి ముద్దయింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కురిసిన వర్షానికి అంబాజీపేట, మాచవరం, పుల్లేటికుర్రు, ముక్కామల తదితర గ్రామాల్లో జనజీవనం చాలా వరకు ఇంటికే పరిమితమైంది. కాలు బయటపెట్టే వీలు లేకుండా రోజంతా వాన కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.



వర్షాలకు ధ్వంసమైన ఆలమూరు మండలం కొత్తూరు-వెదురుమూడి రోడ్డు

రోడ్లను ముంచెత్తిన భారీ వర్షం

మామిడికుదురు: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం ప్రధాన రహదారులను ముంచెత్తింది. భారీ వర్షానికి పలు రోడ్లపై మూడడుగుల మేర వర్షం నీరు నిలిచిపోయింది. మామిడికుదురు, నగరం, పాశర్లపూడి గ్రామాల్లోని 216వ నంబర్ జాతీయ రహదారిపై భారీగా వర్షం నీరు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మామిడికుదురు ముస్లిం వీధి, అప్పనపల్లి మొల్లేటివారిపాలెం రోడ్లను సైతం వర్షం నీరు ముంచెత్తింది. పలు గ్రామాల్లో కాల నీలతో పాటు పంచాయతీ రోడ్లు వర్షం నీటితో మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాడ్రేవుపల్లి, కడలి మీడియం డ్రైన్లతో పాటు వాడబోది డ్రైన్ పొంగి ప్రవహించాయి. మామిడికుదురు షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి.

పల్లపు ప్రాంతాలు జలమయం

పి.గన్నవరం: మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాల్లోని కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో పంట చేలు నీటమునిగాయి. ముంపు నీరు బయటకు వెళ్లకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పి.గన్నవరం-అంబాజీపేట పూర్తిగా పాడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కేశనపల్లి తీరంలో అల్లకల్లోలంగా సముద్రం



అప్పనపల్లిలో ముంపునకు గురైన మొల్లేటివారిపాలెం రోడ్డు